**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

# ఆధునికాంధ్ర కవితాసారధి- దాశరథి కృష్ణమాచార్యులు

**డా.డి. సత్యలత**
ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల - 533435.

"కోటి తమ్ముల కడ రెండుకోట్ల తెల్గు టన్నులనుగూర్చి వృత్తాంతమంద జేసి మూడు కోటుల నొక్కటే ముడిబిగించి పాడినాను మహాంధ్ర సౌభాగ్య గీతి"

పద్యరచనలో ప్రతిభావంతుడైన మహాకవి దాశరథి. దేశ చరిత్రను ఇతి వృత్తంగా తీసుకొని తెలుగు ప్రజల్లో చైతన్యం దీపింప జేసాడు. తెలుగు పద్యరచనకు కొత్త ఒరవళ్లు పెట్టడం, తెలంగాణా బంధాలు ఛేదించటం, నవాబు రాక్షస పాలనకు చరమగీతం పాడించటం, మహాంధ్రోద్యయానికి మహోన్నతంగా కృషి సాగించటం దాశరథి జీవితంలోనూ, కవిత్వంలోనూ మహోజ్వలంగా ప్రకాశించే ఘట్టాలు.

దాశరథి కృష్ణమాచార్యులు వరంగల్లు జిల్లా గూడూరులో జూలై 22వ తేదీ. 1925వ సంవత్సరములో పండిత వంశంలో జన్మించారు. ఖమ్మం ఉస్మానియా హైస్కూల్లో మెట్రిక్యులేషన్ వరకు చదివారు ఉద్యోగ జీవితం జైలు నుండి విడుదలైన తరువాత దాశరథికి 1950లో వివాహమైంది. కొంత కాలం స్థానిక స్వపరిపాలన శాఖలో ఉద్యోగిగా పనిచేశాడు. గ్రామం పంచాయితీలను తనిఖీ చేయడం ఉద్యోగవిధి. ఉద్యోగవిధి నిర్వహిస్తూనే స్వయంకృషితో బి.ఏ. ఆంగ్ల సాహిత్యం ప్రధానాంశంగా ఉత్తీర్ణుడయ్యాడు. ఉద్యోగరీత్యా తెలంగాణా పల్లె ప్రాంతాలలెన్నో సందర్శించారు. పాటకులను రంజింప జేసే రెండు వేల పాటలను రచించి సినీరంగంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకొన్నాడు. సినీగీతాల రచనతో పాటు ఆకాశవాణి ఉద్యోగాన్ని 1971 లకు కొనసాగించారు. ఉద్యోగ కాలంలోనే రచనా వ్యాసంగం విరివిగా సాగింది. 1977 ఆగష్టు 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాశరథిని ప్రభుత్వ ఆస్థానకవిగా నియమించి ఆయన కవితా ప్రతిభకు సముచిత గౌరవాన్ని కల్పించింది. వీరు 16 రచనలు, అనేక అవార్డులు మరియు బిరుదులు అందుకున్నారు.

అప్పటి నిజాం నవాబు దురాగతాలలో 1943 ప్రాంతంలో 'గార్ల' జాగీరులో రైతుల అలజడి ప్రారంభమైంది. రైతుల దుస్థితిని చూచి చలించిపోయాడు. నిజాం నవాబును నిరసిస్తూ "మానిజాము రాజు, జన్మజన్మాల బూజ" అన్నారు. తన కన్న తల్లి కన్న మిన్నగా భావించే జన్మభూమి

తెలంగాణాను ప్రశంసిస్తూ "నా తెలంగాణ కోటి రత్నాల వీణ " గా పేర్కొన్నారు. ఆయన మాటలు ఈటెలుగా, కవితాసూక్తులు చురకత్తులుగా నిజాం ప్రభుత్వానికి దడపుట్టించాయి. ఆవేశపూరితయైన ఉపన్యాసాలతో ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించారు. 1946 డిశంబరు 18వ తేదీన మానుకోట తాలూకాలో ఒక గ్రామంలో వీరావేశంతో "తెలంగాణము రైతుదే. ముసలినక్కకు రాచరికము దక్కునే" అని అగ్ని ధారలు కురిపించారు.ఆ స్థితిలో దాశరథిని పోలీసులు అరెస్ట్ చేశారు. అక్కడ నుండి 20 మైళ్ల నడిపించి మండుటెండ్లలో పురవీధుల్లో ఈడ్చుకొని 'వల్లికుదురు తానా' కు తీసుకెళ్లారు. చుట్టు పోలీసులు కాపలా ఉన్నా తప్పించుకొని పరుగెత్తాడు. రజాకార్ల లాఠీ దెబ్బలతో క్షతగాత్రుడైన దాశరథి క్షుభిత కల్లోల హృదయం నుండి అగ్ని ధారలు కురిపించాడు.

నవాబుకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడు. దాదాపు పదహారు నెలల జైలు జీవితంలో కొరడా దెబ్బలు తిన్నారు. జైలు గోడలపై బొగ్గుతో నవాబు దారుణాలను నిరసిస్తూ "ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మా కెన్నడేని తీగెలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటిరత్నాల వీణ" అగ్ని ధారలో అన్నారు. ఆ పద్యం చదివిన అధికారులు అదిరిపడ్డారు. వాళ్లు ఎన్నిసార్లు చెరిపినా అన్నిసార్లు జైలు గోడలపై దాశరథితో పాటు జైలు జీవితం గడిపే వట్టికోట ఆళ్వారు స్వామి రాసేవాడట. 1948 సెప్టెంబర్ 11వ తేదీన దాశరథిని జైలు అధికార్ల దారుణాతిదారుణంగా చిత్రవధలు పెట్టారు. అస్వస్థతకు గురైన దాశరథి అదృష్టవశాత్తు బ్రతికి బయట పడ్డాడు. ఇతర రాజకీయ ఖైదీలతో పాటు ఆయనకు 1948 సెప్టెంబర్ 18వ తేదీన విముక్తి లభించింది. జైలు జీవితం గడిపిన చీకటి రోజుల్లో కవితాకరవాలంతో పోరాటం సాగించారు. కవితా దీప్తులతో ప్రకాశించారు..

**దాశరథి లక్ష్యం మహాంధ్రోదయ సాధన:** నిజాం నవాబు నిరంకుశ పాలనను ఎదిరించి తెలంగాణా ప్రజలకు విముక్తి లభించిన పిదప వారిని సర్కారు, రాయల సీమ ప్రాంతాల ప్రజలతో కలిపి మహాంధ్రనుసాధించి సమైక్యంగా తెలుగు ప్రజలుగా జీవించాలన్న కాంక్ష దాశరథిది. అప్పట్లో సమైక్యాంధ్రకు, తెలంగాణా ప్రాంతం నుండి, ఆంధ్ర ప్రాంతం నుండి కొంత వ్యతిరేకత ఉంది. రెండు ప్రాంతాలను కలపాలనే ఆశయం అత్యధిక సంఖ్యాకుల అభిమతం. వారిలో ప్రథముడు దాశరథి. "మూడు చెరగుల నేలలు మూడుకోట్లు ముడివడిన యట్లు" కన్నుల ముందు తోచింది. "కోటి తమ్ముల కడ

రెండుకోట్ల అన్నలను గూర్చి" ముచ్చటించాడు. అప్పటి తెలంగాణా జనాభా కోటి. ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రజలజనాభా రెండు కోట్లు. సమైక్యతా ప్రబోధాన్ని తెలంగాణ ప్రజలకు చేశాడు.

ఆంధ్ర రాష్ట్ర సిద్ధికి అసువులు బాసిన పొట్టి శ్రీరాములు నిద్రావస్థలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని మేలుకొల్పగలను. నిశ్చింతగా నీవు లెమ్మని కవితో పలికాడు. గోదావరీ నది ఆప్యాయతతో ఆదరించి కవి ముఖం కడుగుకొనేందుకు నీటిని అందించింది. తుంగభద్రానది తనపైటకొంగుతో ముఖాన్ని తుడిచి నిద్రభారాన్ని తొలగించింది. పెన్నానది తనకమ్మని అమృతపు నీటిధారలతో ఆకలిని తీర్చింది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మూడునూ ముచ్చటగా కలిసిపోయిన మూడుకోట్ల సమైక్యాంధ్రం కన్నులకు సాక్షాత్కరించింది. మూడు ప్రాంతాల ప్రకృతి, నదుల మహోంధ్రోదయంతో పులకించి పోయాయి.

మహోంధ్రోదయం కవి పారవశ్యం: మహోంధ్రోదయ ప్రభాతంలో జగతి మేల్కొన్నది. కారాగారపు సంకెళ్ల ఘలం ఘలలు స్థంభించాయి. కాకతీయుల ప్రాభవం, రుద్రమవీరత్వపు వైభవం, కృష్ణరాయల కీర్తి చంద్రికలు, సింగన ప్రభువు ప్రతిభ, వారందరు తనలో ఉన్నారని పారవశ్యంతో "అరి శిరస్సులనుత్తరించిన ! అలుగు నేనే ! తెలుగు నేనే !" అని గానం చేశాడు. మహోంధ్రోదయం - కవికాంక్ష: కవి తనకు కొత్త దిరిసెన పూలవంటి మృదువైన భావాలతో కూడిన కావ్యాల సముదాయం కావాలన్నాడు. హృదయాంతరాల్లో భగ్గున మండే బడబాగ్నుల దారులు కావాలన్నాడు. శ్రామికుల తిరుగుబాటు వల్ల సమసమాజం సిద్ది స్తుందని కవి ఆశ. కర్షకుని నాగేటి కర్రుతో కుమ్మిన పొలాల బోరులు కావాలన్నాడు. దాని వల్ల సుభిక్షమైన పంట పండుతుంది. సమాజంలో ప్రజల జీవనం ప్రశాంతంగా ఉంటుందని కవికాంక్ష. "నాకు కావలె మహోంధ్రోర్వర! రండి అన్నలార" తూర్పు దిక్కు కెదురుగా అనురాగ బంధంతో మనిషి మనిషి సఖ్యతతో కలసి రమ్మని పిలిచాడు. కవికి తెలుగు ప్రజలపై, తెలుగు ఊళ్లపై విశేషమైన అభిమానం ఉంది. అందుకే తెలుగువారి ఘనతను వినుతించే, తెలుగు గ్రామీణ సంస్కృతిని ప్రతిఫలించే మహాకావ్యం తనకు కావాలని కాంక్షించాడు.

**మహోంధ్రోదయ దీప్తి - చారిత్రక స్ఫూర్తి:** కవి మహోంధ్రోదయ సిద్ధితో గత చారిత్రక దీప్తులను వర్ణించాడు. ధగ ధగ కాంతులతో చాళుక్యుల పాలనా దీప్తులు గోదావరీ నదీ ప్రవాహంలో కవికి కనిపించాయి. ఆ కాంతులను తన కళ్లలో చూడమంటున్నాడు. మనోజ్ఞమైన కాకతీయుల పాలనా రవళుల ఘణ ఘణలు తన గళంలో వినమన్నాడు. విద్యానగర రాజుల యుద్ధ భేరీ రవాలు తన హృదయంలో

మార్మోగుతున్నాయి. వాటిని వినమన్నాడు. కాపయ నాయకుని ఘనశౌర్య దావాగ్ని దీప్తి తన కలంలో ప్రవహిస్తుంది. పరిశీలించి చూడమన్నాడు. కాపయనాయకు డంటే దాశరథికి ప్రత్యేక అభిమానం. అందుకే తన మహాంధ్రోదయ కావ్యంలో ప్రత్యేకించి 'కాపయనాయకుడు' ఖండికను రచించాడు. నా తెలంగాణ దిగ్గంతాల దాక విస్తరించిన వెన్నెల వెలుగుల్లో మహాకవి పోతన నుండి తనదాక పొంగి పొరలిన కావ్యాలను చదువమన్నాడు. కవి మూడు ప్రాంతాల చారిత్రక సంఘటనలను పారవశ్యంతో వర్ణించాడు. మహాంధ్రోదయం కవి అనుభూతి మహాంధ్రోదయం కవికి చిరకాల వాంఛ. తెలంగాణ సంకెళ్లు ఛేదించేందుకు కవి ఆకాశం దద్దరిల్లేట్లు గర్జించాడు. రాక్షసిలా ప్రజలను వేధించే నవాబు గుండె నీరయ్యేట్లు, తెలంగాణ ఘనతను వినతించేట్లు పద్యాలు వేయి స్తంభాల నీడలో తెలుగుతోట నాటి తెలుగు సుమాలు విరబూయించాడు. తెలంగాణ కోటిమంది తమ్ములకడ రెండుకోట్ల సర్కారు, రాయలసీమ ప్రజల ఘనతను వివరించి మూడుకోట్ల ప్రజల సమైక్యతను కాంక్షిస్తూ ఆత్మీయమైన మహాంధ్ర సౌభాగ్యగీతిని అనుభూతితో ఆలపించాడు. మహాంధ్రోదయ సిద్ధి - తెలుగు అందాలతో కవి ప్రేయసి

మహోంధ్రోదయ సిద్ధితో కవిమనస్సు ప్రశాంతంగా కుదుటబడింది. తన ప్రేయసిలో తెలుగు అందాలను దర్శించాడు. తన ప్రేయసిలో తెలుగు సిగ్గులు మొలకలెత్తాయి. నవ్వుల కాంతులతో తన యింట ప్రవేశించి ఆ తెలుగుపిల్ల దీపాన్నిపెట్టింది. కన్నడ ప్రభావం సోకని అచ్చ తెలుగు కవిత్వంలా శృంగార రసభరితంగా కవిని ఆకర్షించింది. మహాంధ్రోదయ సందర్భంగా కోట్లాది తెలుగు ప్రజలు ఆనందంతో తెలుగు తల్లి పాదాలకు పారాణిదిద్ది పండుగ జరుపుకొన్నారు. దాశరధి మహాంధ్రోదయాన్ని ప్రత్యేక శ్రద్ధతో వర్ణించాడు.

**2. 'మహాంధ్రోదయం - దాశరథి కవితారీతులు:** కవిత్వానికి రెండు ప్రధానాంగాలు. ఒకటి ఇతివృత్తం. రెండు శైలి. ఏమి చెప్పాడన్నది ఇతివృత్తమైతే, కవి పద ప్రయోగాలు ఛందస్సు, అలంకారాలు, ప్రతీకలు మొదలైనవన్నీ శైలికి సంబంధించినవి.. దాశరథి కవితా తత్త్వంలో శాంతి విప్లవ చైతన్యధార ఉంది. అభ్యుదయ భావానురక్తి కవితావేశం దాశరథిలో ఉన్నవి. 'మహోంధ్రోదయం ఖండికలో నిజాంపాలనలో ప్రజలు అనుభవించిన బాధలను, బతుకుల నిరసన సమైక్యాంధ్ర సాధనవల్ల ప్రజలకు కలిగిన సంతోషం. కవికి కలిగిన పారవశ్యం, చారిత్రక దీప్తులు వర్ణితములైనవి. మహాంధ్రోదయం ఖండికను పద్యగేయ సమ్మిశ్రితంగా రచించాడు. ఇందులో ఒక తేటగీతి, మాత్రా ఛందస్సులో ఒకగేయం, తరువాత ఒక చంపకమాల, రెండు మత్తేభాలు, ఒక సీసం తరువాత మూడు సీసాలు, చివరలో గేయంతో ముగిసింది.

**United International Journal of Multidisciplinary Research**
ISSN: 3048-6726 (UIJMR) Impact Factor: 6.934 (SJIF)
An International Peer-Reviewed and Refereed Multidisciplinary Journal
www.uijmr.in Vol-3, Special Issue-II ,2026

దాశరథి పద్యాన్ని హృద్యంగా శైలి సౌందర్యంతో నడపగలడు. సంస్కృత సమాసభూయిష్టమైన ప్రాబంధకశైలి ఈ ఖండికలోఉంది.సూర్యోదయాన్ని వర్ణించారు. ఆయనకు శబ్దాధికారం గొప్పగా ఉంది. అందుకు చక్కని బంధాలు ఆయన కవిత్వంలో కనిపిస్తాయి. నూతన పదబంధాలు, ఆయన కవిత్వానికి వన్నె తెచ్చాయి. సంస్కృత పద బంధాలు, తెలుగు పదబంధాలు మహాంధ్రోదయం ఖండికలో ఉన్నాయి. అదేవిధంగా వెలుతురుల బాకు, వెలుగుపులుగు, తెలుగునింగి వంటి తెలుగు పదబంధాలు సందర్భోచితంగా ఔచిత్యంగా కవి ప్రయోగించాడు. మహాంధ్రోదయంలో బడబాగ్ని, దావాగ్ని వంటి పదాలు మరియు సందర్భోచితంగా ధ్వన్యనుకరణపదాలు ప్రయోగించారు. "జిలుజిల్లునన్' ధాణంధణల్, మణంమణలు, మొదలైనధ్వన్యనుకరణపదాలున్నాయి. ఆధునిక కవులు సందర్భోచితంగా సన్నివేశాన్ని పాఠకుల హృదయాల్లో హత్తుకొనే ప్రతీకలను ప్రవేశపెట్టారు. వారిలో దాశరథి ప్రముఖుడు. ఈ ఖండికలో 'చిమ్మచీకటి' 'అంధకార శయ్యాగృహం' ఈ పదాలను నిజాం నవాబు పాలనలో ప్రజలనుభవించిన బాధలను సూచించేందుకు ప్రతీకలుగా ప్రయోగించాడు.

**ఆలంకారిక శోభ:** దాశరథి మహాంధ్రోదయంలో ఉపమ రూపకం, అతిశయోక్తి, స్వభావోక్తి అలంకారాలు సందర్భోచితంగాప్రయోగించాడు. ఉపమాలంకారాలు "రూపకాలంకారాలు, అతిశయోక్తి, అతిశయోక్తి, స్వభావోక్తులు చక్కగా ప్రయోగించాడు. చక్కని శైలి సౌందర్యంతో కూడిన ప్రబోధాత్మకమైన మహాంధ్రోదయం ఖండిక ఆంధ్ర పాఠకులకు అభిమానపాత్రమైంది.